క్లుప్తంగా

నేడు అన్నదానం

నల్లకుంట: గణేష్ నిమజ్జనాన్ని పురస్కరించుకుని భక్తులకోసం నేడు నల్లకుంట ఫీవర్ ఆసుపత్రి బస్‌స్టాప్ వద్ద అన్నదాన కార్యక్రమాన్ని నిర్వహించనున్నట్లు గోల్నాక కార్పొరేటర్ దూసరి లావణ్య శ్రీనివాస్‌గౌడ్ ఓ ప్రకటనలో తెలిపారు. మధ్యాహ్నం 12 గంటలకు ఈ కార్యక్రమం ప్రారంభమవుతుందన్నారు.

ఉచిత వైద్య శిబిరం



ఉచిత వైద్య శిబిరాన్ని నిర్వహిస్తున్న దృశ్యం

సుందరయ్య విజ్ఞాన కేంద్రం: ఆరోగ్యమే మహాభాగ్యమని, స్వచ్ఛంద సంస్థలు నిర్వహించే ఉచిత వైద్య శిబిరాలను సద్వినియోగం చేసుకోవాలని వాకర్స్ క్లబ్ ఆఫ్ హైదరాబాద్ అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు ఎస్.రమేష్‌రెడ్డి, పీ.వీ.నిరంజన్‌రెడ్డి అన్నారు. బుధవారం సుందరయ్య పార్కులో కామినేని ఆసుపత్రి కింగ్‌కోఠి ఆధ్వర్యంలో ఉచిత వైద్య శిబిరం నిర్వహించారు. ఈ సందర్భంగా బీపీ, షుగర్ తదితర పరీక్షలను నిర్వహించారు. క్లబ్ సీనియర్ సలహాదారులు వెంకటకృష్ణారావు, మాజీ అధ్యక్షులు మురళీకృష్ణ, స్కైలాబ్‌బాబు, కామినేని ఆసుపత్రి సిబ్బంది తదితరులున్నారు.

ముషీరాబాద్ బీజేపీ ప్రభారీగా వేణుమాధవ్



ముషీరాబాద్: వచ్చే అసెంబ్లీ ఎన్నికల నేపథ్యంలో బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు జి.కిషన్‌రెడ్డి రాష్ట్రవ్యాప్తంగా అన్ని నియోజకవర్గాలకు ప్రభారీలను నియమిస్తూ.. ఉత్తర్వులు జారీ చేశారు. ముషీరాబాద్ నియోజకవర్గం సంగారెడ్డికి చెందిన బీజేపీ రాష్ట్ర నాయకులు వేణుమాధవ్‌కు నియమించారు.

సదరం క్యాంపుల్లో అక్రమాలపై విచారణ జరపాలి

సుందరయ్య విజ్ఞాన కేంద్రం: కరీంనగర్ జిల్లాతో పాటు రాష్ట్రవ్యాప్తంగా సదరం క్యాంపుల్లో జరుగుతున్న అవినీతి అక్రమాలపై సమగ్ర విచారణ జరిపించాలని దివ్యాంగుల హక్కుల జాతీయ వేదిక రాష్ట్ర అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు కె.వెంకట్, ఎం.అడవయ్య, కోశాధికారి ఆర్.వెంకటేష్‌లు ఓ ప్రకటనలో డిమాండ్ చేశారు. స్లాట్ బుక్ చేయడం కోసం డబ్బులు వసూలు చేస్తున్న మీసేవాకేంద్రాలను సీజ్ చేయాలని వారు కోరారు. వైకల్య ధ్రువీకరణ పత్రం పొందాలంటే మీసేవా కేంద్రాల్లో స్లాట్‌బుక్ చేసిన తరువాతే సదరం క్యాంపునకు హాజరుకావాల్సి ఉంటుందన్నారు. దీన్ని ఆసరాగా చేసుకుని మీసేవా సెంటర్లలో రూ.500-రూ.5000 వేల వరకు వసూలు చేస్తూ.. దివ్యాంగులను మోసం చేస్తున్నారని ఆరోపించారు. మీసేవా కేంద్రాలలో స్లాట్ బుక్ చేయాలంటే కనీస చార్జీలు మాత్రమే వసూలు చేయాలన్నారు. నిబంధనలకు విరుద్ధంగా మీసేవా సెంటర్లు వ్యవహరిస్తున్న అధికారులు పట్టించుకోవడం లేదని వారు ఆరోపించారు.

నిమజ్జన ఏర్పాట్లను మేమే నిర్వహించుకుంటాం!

భాగ్యనగర్ గణేష్ ఉత్సవ సమితి నేతల హెచ్చరిక

ముషీరాబాద్: ట్యాంక్‌బండ్‌పై గణేష్ నిమజ్జనానికి 24 గంటల్లో ఏర్పాట్లు చేయకపోతే తామే ఏర్పాట్లు చేసుకుని హుస్సేన్‌సాగర్‌లో వినాయక విగ్రహాలను నిమజ్జనం చేస్తామని భాగ్యనగర్ గణేష్ ఉత్సవ సమితి అధ్యక్షులు డాక్టర్ భగవంత్‌రావు, ఉత్సవ సమితి కార్యదర్శి రావినూతల శశిధర్, బీజేపీ ఓబీసీ మోర్చా రాష్ట్ర అధ్యక్షుడు ఆలే భాస్కర్‌లు ప్రభుత్వాన్ని హెచ్చరించారు. వినాయక నిమజ్జనాల కోసం ట్యాంక్‌బండ్ వద్ద ప్రభుత్వం, జీహెచ్ఎంసీ ఎలాంటి ఏర్పాట్లు చేయకపోవడంతో వారు బుధవారం ట్యాంక్‌బండ్‌పై నిరసన వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. ప్రభుత్వం స్పందించి 24గంటల్లో నిమజ్జన ఏర్పాట్లను చేయాలని లేనిపక్షంలో జంట నగరాలలో ఉన్న గణేష్ మండప నిర్వాహకులు ట్యాంక్‌బండ్‌లోనే వినాయక నిమజ్జనం చేసేలా ఉత్సవ సమితి ఏర్పాట్లు చేస్తుందన్నారు. గణేష్ మండప నిర్వాహకులు ట్యాంక్‌బండ్ వద్దకు తరలిరావాలని పిలుపునిచ్చారు. గత 44 ఏళ్లుగా ట్యాంక్‌బండ్‌పై గణేష్ విగ్రహాల నిమజ్జనం ఆనవాయితీగా వస్తుందని ఈసారి ప్రభుత్వం ఏర్పాట్లు చేయకపోవడాన్ని ప్రశ్నించారు. మిగతా పండుగలకు అన్ని ఏర్పాట్లు చేసిన ప్రభుత్వం హుస్సేన్‌సాగర్ కలుషితం పేరుతో తప్పించుకునే ప్రయత్నం చేస్తుందని ఆరోపించారు. ప్లాస్టర్ ఆఫ్ ప్యారీస్ విగ్రహాల తయారీకి ఎందుకు అనుమతినిచ్చిందో తెలపాలన్నారు. కేవలం హిందూ పండుగలకే ప్రభుత్వం ఆంక్షలు విధించడం సరికాదని విమర్శించారు. ప్రభుత్వం స్పందించి గణేష్ నిమజ్జన ఏర్పాట్లు చేయాలని, లేని పక్షంలో ట్యాంక్‌బండ్‌పై జరిగే ఘటనలకు ప్రభుత్వమే పూర్తి బాధ్యత వహించాల్సి ఉంటుందని హెచ్చరించారు. భాగ్యనగర్ గణేష్ ఉత్సవ సమితి, వీహెచ్‌పీ నేతలు, గణేష్ మండప నిర్వాహకులు పెద్ద ఎత్తున పాల్గొన్నారు.

ప్రజా సమస్యల పరిష్కారానికి కృషి



అశోక్‌నగర్ పార్క్-2లో అభివృద్ధి పనులను ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే ముఠాగోపాల్

చిక్కడపల్లి: ప్రజా సమస్యల పరిష్కారమే ధ్యేయంగా పనిచేస్తున్నామని ఎమ్మెల్యే ముఠాగోపాల్ అన్నారు. బుధవారం గాంధీనగర్ డివిజన్‌లో రూ.41 లక్షలతో 6 ప్రాంతాల్లో ఫుట్‌పాత్ నిర్మాణ పనులు, రూ.17 లక్షలతో అశోక్‌నగర్ పార్క్-2ను అభివృద్ధి పనులను గాంధీనగర్ డివిజన్ కార్పొరేటర్ ఎ.పావనీవినయ్‌కుమార్‌లతో కలసి ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ.. నియోజవర్గ పరిధిలో కోట్లాది రూపాయలతో ప్రజలకు మౌలిక వసతులు కల్పించడంతో పాటు పార్కులను అభివృద్ధి చేయడం జరిగిందన్నారు. ఈ సందర్భంగా కార్పొరేటర్ పావనీవినయ్‌కుమార్ మాట్లాడారు. బీజేపీ నేత ఎ.వినయ్‌కుమార్, బీఆర్ఎస్ యువజన నాయకుడు ముఠా జైసింహ, జీహెచ్‌సీ డీఈ గీత, ఏఈ అబ్దుల్‌సలాం, బీఆర్ఎస్ నాయకులు రాకేష్‌కుమార్, ముఠా నరేష్, ముచ్చకుర్తి ప్రభాకర్, ఎర్రం శ్రీనివాస్‌గుప్తా, జగదీశ్‌బాబు, గడ్డమీది శ్రీనివాస్, రవిశంకర్‌గుప్తా, బత్తుల కిరణ్‌కుమార్, హెచ్.హన్మంతు, నర్సింహ, ఆనంద్, భాస్కర్‌రెడ్డి, బీజేపీ నాయకులు రత్నసాయిచంద్, సురేందర్, జీహెచ్ఎంసీ వర్క్ ఇన్‌స్పెక్టర్ మహేష్, స్థానిక కాలనీవాసులు రవీందర్, సీ.హెచ్. శ్రీనివాస్‌లు పాల్గొన్నారు.

భోలక్‌పూర్ డివిజన్‌లో రూ.కోటితో అభివృద్ధి పనులు..

ముషీరాబాద్: భోలక్‌పూర్ డివిజన్‌లోని వివిధ ప్రాంతాలలో రూ.కోటితో అభివృద్ధి పనులను ఎమ్మెల్యే ముఠా గోపాల్, స్థానిక డివిజన్ కార్పొరేటర్ గౌసుద్దీన్‌తో కలిసి ప్రారంభించారు. పీఅండ్‌టీ కాలనీలో రూ.38 లక్షలతో కమ్యూనిటీహాల్ నిర్మాణం, రూ.40 లక్షలతో సీసీ రోడ్డు, పద్మశాలీ కాలనీలో రూ.9 లక్షలతో సీసీ రోడ్డు, గుల్షన్‌నగర్‌లో రూ.18 లక్షలతో సీసీ రోడ్డు నిర్మాణ పనులను ప్రారంభించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ.. నియోజకవర్గంలో అధ్వానంగా మారిన రోడ్లను యుద్ధ ప్రాతిపదికన అభివృద్ధి చేస్తున్నామన్నారు. బీఆర్ఎస్ యువజన విభాగం నగర నాయకులు ముఠా జైసింహ, భోలక్‌పూర్ డివిజన్ బీఆర్ఎస్ అధ్యక్షులు వై.శ్రీనివాస్‌రావు, మైనార్టీ కమిటీ రాష్ట్ర నాయకులు రహీం, డివిజన్ ఉపాధ్యక్షులు శంకర్‌గౌడ్, బీసీసెల్ అధ్యక్షుడు ఉమాకాంత్, ముచ్చకుర్తి ప్రభాకర్, జీహెచ్ఎంసీ డీఈ సన్నీ, ఏఈ సుబాష్ తదితరులున్నారు.



పీఅండ్‌టీ కాలనీలో కమ్యూనిటీహాల్ నిర్మాణ పనులను ప్రారంభిస్తున్న దృశ్యం

- భోలక్‌పూర్ డివిజన్ పీఅండ్‌టీ కాలనీ వాసులు ఎమ్మెల్యే ముఠా గోపాల్‌ను మిఠాయి గోపాల్‌గా అభివర్ణించారు. పీఅండ్‌టీ కాలనీ వెల్ఫేర్ అసోసియేషన్ అధ్యక్ష, కార్యదర్శులు రాంబాబు, లత మాట్లాడుతూ.. తమ కాలనీలో గత 30 ఏళ్లుగా ఉన్న సమస్యలను ఎమ్మెల్యే పరిష్కరించారన్నారు.

కుల సంఘాల అభివృద్ధికి ప్రభుత్వం పెద్దపీట

కాచిగూడ: కుల సంఘాల అభివృద్ధి, సంక్షేమానికి ప్రభుత్వం ప్రత్యేక కృషి చేస్తోందని ఎమ్మెల్యే కాలేరు వెంకటేష్ అన్నారు. నింబోలిఅడ్డలో రూ.50 లక్షలతో నిర్మించనున్న నీలకంఠ సంఘ భవన నిర్మాణ పనులను ఎమ్మెల్యే బుధవారం ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. నియోజకవర్గంలో కులమతాలు, పార్టీలకు అతీతంగా అభివృద్ధి కార్యక్రమాలను చేపడుతూ.. ఆదర్శవంతమైన నియోజకవర్గంగా తీర్చిదిద్దుతున్నట్లు పేర్కొన్నారు. పేద ప్రజల సంక్షేమం, అభివృద్ధికి సీఎం కేసీఆర్ ప్రభుత్వం వివిధ సంక్షేమ, అభివృద్ధి పథకాలకు లక్షలాది కోట్ల రూపాలయను ఖర్చు చేస్తోందన్నారు. నీలకంఠీయుల సమస్యల పరిష్కారానికి తనవంతు కృషిచేస్తానని ఎమ్మెల్యే హామీ ఇచ్చారు.



నీలకంఠ సంఘం భవన నిర్మాణ పనులను ప్రారంభించిన ఎమ్మెల్యే కాలేరు

నీలకంఠ సంఘం అధ్యక్షుడు వీరబత్తిని శంకర్, హరికిషన్, అంబదాస్, నాగరాజు, మహేష్, గణేష్, శంకర్, చంద్రశేఖర్, రాజు, శ్రీనివాస్, శ్రీధర్ తదితరులున్నారు.

బిల్లులు చెల్లించకుంటే పనులు నిలిపివేస్తాం

లాలాపేట: చేసిన పనులకు బిల్లులు చెల్లించడం లేదంటూ బుధవారం సికింద్రాబాద్ కాంట్రాక్టర్స్ అసోసియేషన్ ఆధ్వర్యంలో జీహెచ్ఎంసీ సికింద్రాబాద్ సూపరింటెండింగ్ ఇంజనీర్ కలిసి వినతి పత్రం ఇచ్చారు. ఈ సందర్భంగా పలువురు మాట్లాడుతూ.. జనవరి నుంచి ఇప్పటి వరకు పనులకు బిల్లులు చెల్లించకపోవడంతో ఇబ్బందులకు గురవుతున్నామన్నారు. పనులు చేసిన కార్మికులకు సకాలంలో వేతనాలు చెల్లించలేక కొందరు కాంట్రాక్టర్లు అప్పుల పాలై ఆత్మహత్యలు చేసుకున్న సంఘటనలు ఉన్నాయన్నారు. పెండింగ్ బిల్లులను వెంటనే చెల్లించాలని లేకుంటే అక్టోబర్ 1 నుంచి పనులన్నింటినీ నిలిపివేస్తామన్నారు. వినతి ఇచ్చిన వారిలో ఆనంద్‌కుమార్, విజయ్‌కుమార్, వీరేష్ ఉన్నారు.



ఎస్ఈకి వినతి పత్రం అందజేస్తున్న కాంట్రాక్టర్లు

అంగన్‌వాడీల సమస్యలను పరిష్కరించాలి



మాట్లాడుతున్న ఎస్.రమ

సుందరయ్య విజ్ఞాన కేంద్రం: అంగన్‌వాడీ ఉద్యోగుల సమస్యలు పరిష్కరించేందుకు ప్రభుత్వం కృషి చేయాలని సీఐటీయూ రాష్ట్ర ఉపాధ్యక్షురాలు ఎస్.రమ అన్నారు. బుధవారం సుందరయ్య విజ్ఞాన కేంద్రంలో శ్రామిక మహిళా సమన్వయ కమిటీ ఆధ్వర్యంలో సమావేశం జరిగింది. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. అంగన్‌వాడీ ఉద్యోగులను పర్మనెంట్ చేయాలని, కనీస వేతనం ఇవ్వాలన్నారు. సుప్రీంకోర్టు తీర్పు ప్రకారం గ్రాట్యుటీ చెల్లింపు, రిటైర్మెంట్ బెనిఫిట్స్ తదితర సమస్యలు పరిష్కరించాలని కోరుతూ గత 17 రోజులుగా రాష్ట్ర వ్యాప్తంగా నిరవధిక సమ్మె చేస్తున్నా.. ప్రభుత్వం పట్టించుకోవడం లేదని విమర్శించారు. అంగన్‌వాడీ ఉద్యోగులపై కేసులు పెట్టి బెదిరింపులకు పాల్పడుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. శ్రామిక మహిళా సమన్వయ కమిటీ నాయకులు ఆర్.వాణి, ఐద్వా అధ్యక్షులు అరుణజ్యోతి, డి.కమలారెడ్డి తదితరులున్నారు.

కామర్స్‌లో విస్తృత అవకాశాలు

కాచిగూడ: నేటి పారిశ్రామిక ప్రపంచంలో సరళీకృత ఆర్థిక విధానాల ద్వారా 'కామర్స్' విస్తృత అవకాశాలు గల రంగంగా ప్రాధాన్యతను సంతరించుకుందని భవన్స్ న్యూ సైన్స్ కళాశాల చైర్మన్ డాక్టర్ ఎస్.జై కిషన్ అన్నారు. బుధవారం నారాయణగూడలోని కళాశాలలో ప్రిన్సిపాల్ పేరాల కృష్ణారావు అధ్యక్షతన 'కామర్స్ ఫెస్ట్' నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. వాణిజ్య శాస్త్రంలో నూతన టెక్నాలజీ ఉపయోగంపై వివరించారు. ఈ కామర్స్, డిజిటల్ బ్యాంకింగ్, మొబైల్ బ్యాంకింగ్, ఇన్సూరెన్స్ సర్వీస్ తదితర రంగాల గురించి విద్యార్థులకు అవగాహన కల్పించారు. శాస్త్ర సాంకేతిక రంగాల్లో విస్తృతమవుతున్నా అవకాశాలను విద్యార్థులు అందిపుచ్చుకోవాలని సూచించారు. శాస్త్రీయ దృక్పథానికి విజ్ఞానం జతచేస్తే ఉజ్వల భవిష్యత్తు ముందుంటుందన్నారు. హెచ్‌ఓడీ కె.అర్చన, ఎ.మాధవి, అధ్యాపక బృందం, విద్యార్థులు పాల్గొన్నారు.



విద్యార్థులతో ప్రిన్సిపాల్ పేరాల కృష్ణారావు, చైర్మన్ డాక్టర్ ఎస్. జైకిషన్

స్థితిగతులను తెలుసుకున్న వారు ఎదుగుతారు



కళాకారులకు స్వర్ణ పతకాలను బహూకరిస్తున్న కేవీ రమణాచారి

చిక్కడపల్లి: సమాజంలో తమ స్థాయిని తెలుసుకుని తమను తాము మలచుకున్న వారు ఎదుగుతారని తెలంగాణ ప్రభుత్వ సలహాదారు డాక్టర్ కేవీ రమణాచారి అన్నారు. బుధవారం చిక్కడపల్లి త్యాగరాయగానసభలో ప్రముఖ మహిళా సంస్కృతిక సంస్థ రాగ సప్తస్వరం నిర్వహణలో యూనియన్ బ్యాంక్, మానేపల్లి జువెలర్స్ సీల్‌వెల్ కార్పొరేషన్, తిరుమలగ్రూప్స్ సంయుక్తాధ్వర్యంలో అక్కినేని నాగేశ్వర్‌రావు శతజయంతి వేడుకలో ఆయన ముఖ్యఅతిథిగా పాల్గొన్నారు. ఈ సందర్భంగా మానేపల్లి జ్యువెల్స్ అక్కినేని స్వర్ణ పతకాలు ప్రముఖ వైద్యులు విజయభాస్కర్, నటి డబ్బింగ్ కళాకారిణి జానకి, రచయిత్రి ఉషారాణి, గాయకులు సురేఖామూర్తి, రామాచారి, శశికళ, వినోద్‌బాబులకు బహుకరించారు. రమణాచారి మాట్లాడుతూ.. అక్కినేని తన తప్పులను ఎరుగుట పెద్ద విద్య అన్న సూక్తి పాటించి జీవితంలో ఎదిగారన్నారు. ఆయన జీవితం నేటి తరాలకు కరదీపిక కావాలన్నారు. తిరుమల గ్రూప్ అధినేత చంద్రశేఖర్ అక్కినేనితో తనకున్న సన్నిహిత అనుబంధాన్ని గుర్తు చేసుకున్నారు. కళాపోషకులు సురేంద్ర, వంశీ రామరాజు, రాజ్యలక్ష్మి, రామాచారి, వినోద్, సురేఖ, శశికళ పాల్గొన్నాయి.

సమస్యల పరిష్కారమే ధ్యేయం

అడ్డగుట్ట: ప్రజా సమస్యల పరిష్కారమే ధ్యేయంగా పని చేస్తున్నామని కార్పొరేటర్ లింగాని ప్రసన్నలక్ష్మి అన్నారు. బుధవారం అడ్డగుట్ట చంద్రయ్య హోటల్ వద్ద డ్రైనేజీ, మంచినీటి పైప్‌లైన్ పనులకు ఆమె శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా కార్పొరేటర్ మాట్లాడుతూ.. దశలవారీగా అభివృద్ధి పనులు చేపడుతూ డివిజన్‌ను అన్ని రంగాల్లో అభివృద్ధి చేస్తున్నామన్నారు. పనుల్లో నాణ్యత ప్రమాణాలు పాటిస్తూ త్వరితగతిన పూర్తి చేయాలన్నారు. ఈ కార్యక్రమంలో జలమండలి ఏఈ స్రవంతి, బీఆర్ఎస్ నాయకులు లింగాని శ్రీనివాస్, మనోహర్, ఎల్లయ్య, పాన్నాల రాజు, మహ్మద్, రవి, సంతోష్, శ్రీరామ్, నర్సింగ్, ఇస్మాయిల్, ప్రవీణ్, రామప్ప పాల్గొన్నారు.

తెలంగాణ బాపూజీ యాదిలో..

ఘనంగా కొండా లక్ష్మణ్ బాపూజీ జయంతి వేడుకలు

అంబర్‌పేట్/ముషీరాబాద్ జోన్ పరిధిలో తొలితరం తెలంగాణ ఉద్యమ నాయకుడు, స్వాతంత్ర్య సమర యోధులు, మాజీ మంత్రి కొండా లక్ష్మణ్ బాపూజీ 108 జయంతి వేడుకలు బుధవారం ఘనంగా జరిగాయి. కొండా లక్ష్మణ్ బాపూజీ జీవితం స్ఫూర్తిదాయకమని ప్రముఖులు, ప్రజా ప్రతినిధులు కొనియాడారు.



విద్యానగర్‌లోని బీసీ భవన్‌లో రాజ్యసభ ఎంపీ ఆర్.కృష్ణయ్య, గుజ్జ సత్యం



కొండా లక్ష్మణ్ బాపూజీ చిత్రపటానికి నివాళులర్పిస్తున్న ఎమ్మెల్యే ముఠా గోపాల్



నివాళులర్పిస్తున్న కార్పొరేటర్ కె.రవిచారి



మాజీ కార్పొరేటర్ శ్రీనివాస్‌రెడ్డి, సంగిశెట్టి జగదీష్



ఆర్టీసీ క్రాస్‌రోడ్స్‌లో పద్మశాలీ సంఘం ఆధ్వర్యంలో..



పండ్లు పంపిణీ చేస్తున్న డాక్టర్ మార్తా రమేష్



టీపీసీసీ ప్రధాన కార్యదర్శి నగేష్‌ముదిరాజ్



నారాయణగూడ పద్మశాలీ భవన్‌లో కందగట్ల స్వామి



నివాళులర్పిస్తున్న జాజుల శ్రీనివాస్‌గౌడ్

జయములిమ్ము వినాయకా

అంబర్‌పేట్ /ముషీరాబాద్ నియోజకవర్గ పరిధిలో గణనాథుడి లడ్డూవేలం, అన్నదానం నిర్వహించడంతో పాటు భక్తులు గణపతి మండపాల్లో విశేష పూజలు చేశారు.



బాగ్ అంబర్‌పేటలో ప్రత్యేక పూజల్లో ఎమ్మెల్యే కాలేరు వెంకటేష్



గోల్నాకలో అన్నదానంలో కార్పొరేటర్ లావణ్య



శివాజీ సేవా సమితి మండపంలో ఎమ్మెల్యే కాలేరు



గోల్నాకలో నియోజవర్గ ఇన్‌చార్జ్ ఎడ్ల సుధాకర్‌రెడ్డి



జవహర్‌నగర్‌లో కార్పొరేటర్ పావని



నల్లకుంట కార్పొరేటర్ అమృత



జైస్వాల్ గార్డెన్స్‌లో లడ్డూ వేలంలో భక్తులు



టీపీసీసీ ఆర్గనైజింగ్ సెక్రటరీ బండారు లత



పాలమూరు బస్తీలో రాజ్యసభ ఎంపీ కె.లక్ష్మణ్



చిక్కడపల్లి కమ్యూనిటీహాల్‌లో..



ఆర్టీసీక్రాస్‌రోడ్స్ లక్ష్మీగణపతి ఆలయంలో..